

# నాశిథిల జీవనము

శ్రీ నాళం కామరాజు.

ఆమె న్నో సంవత్సరాల వయస్సు లేదు. తెల్లని శరీరచ్ఛాయతో మనిషి కొంచెం సన్నంగా వుంటుంది. నల్లని కారుమబ్బుల్లోనుంచి తొంగి చూస్తోన్న చంద్ర బింబమువలె ఆమె ధరించిన వేషములో నుంచి తేజో విహీనంగా అగుపించుతోంది ఆమె ముఖము. అయినప్ప టికీ దార్లు దార్లుగా విడిపోయి ముళ్లుపడియున్న ఆమె జుట్టు—చినిగిపోయి దుమ్ముతో నిండియున్న ఆమె చీర—ఎండకుఎండి వానకుతడిసి కళావిహీనమై పెట్లూ డిన శరీరము—అవి ఆమెను పూర్తిగా వికృతంగా చేసి వైచినవి. ఆమెదేహం చాలావరకు శుష్కించి పోయినది. కండ్లు లోనికి పోయినవి. ముఖమంతా మురికి అయి నల్లగా, అసహ్యముగా వున్నది. పాత కాగితాలను—బజార్లలో పడవైచిన గుడ్డపేలికలను మూటలు మూటలుగా ప్రోగుచేయడమే ఆమె నిత్య కృత్యం.

"అది పిచ్చిది. దానిజోలికి ఎవ్వరూ వెళ్ళబోకండి. పిల్లలను కఱుస్తుంది. రాళ్లు విసురుతుంది. జాగ్రత్త సుమా!" అని ప్రతివారున్నూ తమ పిల్లల్ని భయపెట్టు తున్నారు.

నిజముగా దాన్ని చూచుటకుగాని— దాన్ని సమీపించుటకుగాని చాలామంది భయపడ్డారు కూడాను. కొంతమంది పెద్దమనుష్యులుచేరి ఆమెను ఆవూరునుంచి తరిమివేయాలని కూడా కృషి సల్పుతోన్నారు.

* * *

ఆమె పిచ్చిదని ప్రతివాళ్ల నమ్మకం. పిల్లలను ఏమి చేస్తుందోయని వాళ్ల భయము. అయితే ఆమె ఎవరి జోలికి రాదు. ఒకరిని తిట్టదు—ఒకరిని కొట్టదు. రాళ్లు రువ్వటం అసలు చేతనే కాదు. యింతవరకు ఒకరినికూడా భయపెట్టిన పాపాన పోలేదు. మొండి గోడలుగల పాడుబడ్డ ఆ పెంకుటింటి వసారాలో ఆమె నివాసం. ఊళ్ళో దొరికిన పాతచెప్పులు—త్రుప్పుపట్టి పసవైచిన పాత లాంతర్లు ట్రంకులు—ఆమెసొమ్ములు. పాతగుడ్డల మూటలు ఆమె మూలధనం. ఆకలయితే యిరుగు పొరుగు యిండ్లకువెళ్లి యింత అడిగి పెట్టించుకొని తింటుంది. లేకపోతే అలాగే పడుండి వుంటుంది. తీక్ష్ణమైన ఎండలు కాస్తున్నా సరే—వణకుపుట్టించే చలివున్నా సరే—తెరిపిలేని వర్షము పడుతోన్నా సరే—ఆమె ఆ ప్రదేశాన్ని మాత్రం మార్చదు. ఆమె వుండే ప్రదేశానికి ఎదురుగనే ఒక్కటే ఒహాటి మునిసిపల్ లాంతరున్నది. కునికి పాట్లు పడుతూ ఆదీపమే రాత్రులవేళ ఆమెకు ఆధారమవుతుంది. తెలికొట్టేవరకు ఆమె ఏవేవో పాటలు పాడుకుంటుంది. ఆ దీపం వింటూ వుంటుంది.

ఆమె పిచ్చిదని మాకు యేకోశాన నమ్మకములేదు. ఆమె ఎవరో ఒహా మహాతల్లి యనియు—ఆమెనుంచి తప్పకుండా మేమందరము ఒక గుణపాఠము నేర్చుకోవలసి వస్తుందనీ మేము గ్రహింప గలిగాం. ఆమె చరిత్రంతా ఏమిటో కనుగొన వలెనని మాకు వోవిధమయిన ఆతురత ఏర్పడింది. ఏపుట్టలో ఏపాము వుంటుందో ఎవరికి తెలుసు!

* * *

ఒకానొకదినం. ఆవేళ ఆఫీసునుంచీ అయిదింటికల్లా వచ్చేశాం. కోట్లు, తలపాగాలు వగయిరాక చేరి డ్రెస్సంతా తీసేసి నేనూ మా సత్యము యిరుగుపొరుగు యింకోఆయన కలసి బయలుదేరాం చల్లగాలికి. మేము నడిచే త్రోవలోనే ఆ పిచ్చిదాని నివాసస్థలం అగుపించ టంచేత—వెతకబోయిన తీగె కాళ్ల చుట్టుకొన్నట్లు—అప్రయత్నంగా అక్కడే ఆగిపోయాం. అప్పటికింకా ఆపిచ్చిది తన యథాస్థానానికి చేరలేదు. ఆమె మాటే చెప్పుకుంటూ మేము అక్కడి గట్లపై కూలబడ్డాము—యింతలో సూర్యుడు ఒక్కసారి అస్తాద్రి గ్రుంకటము—ప్రకృతంతా నల్లబడటము—ఒక్కసారిగా మునిసిపల్ దీపాలన్నీ వెలగటము—అన్నీ కూడా జరిగాయి. యింకా ఆ పిచ్చిది ఎంతసేపటికి వస్తుందోనని మాలో మేం అనుకొంటున్నాం, పిలిచినట్లుగా యింతలో అదే వచ్చింది.

మొదట్లో మమ్ములనుచూచి గాబరా పడింది. భయకంపితమై వెన్నక్కు తిరిగింది. మేము దాన్ని కూర్చోపెట్టి మంచిమాటను చెపుతూ దాని భయాన్ని పార ద్రోలగలిగాం.

“తల్లీ...మీదేవూరు? ఏ కులము? యీలా బయలుదేరుటకు కారణము యేమిటి?” అని మేము నెమ్మదిగా లాలించి ఆమెను అడిగాము. అందుకు ఆమె ఏమియు జవాబివ్వ జాలక దృష్టిక్రిందకు వాల్చింది అతి వినయంగా. అదే ప్రశ్నను మళ్ళా వేశాము. దానికామె ఏమనుకుందో గాని తలయెత్తి మావైపు చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచింది. ఎర్రగా ప్రకాశించుతోన్న ఆమె నేత్రద్వయంనుంచి బొటబొట నాలుగు అశ్రుబిందువులు రాలినవి. ఆమె కన్నీటి ధారలు మాహృదయాలను కల్మషం లేకుండా కడిగి వైచినవి. ఆమె ఎంతమాత్రం ఉన్మత్తురాలు కాదని ఆమెయొక్క వినయవిధేయతలే బహిరంగ పరుస్తోన్నాయి. హృదయ పరితాపము చల్లబడింది. మళ్లీ ప్రశ్నించాము.

“అయ్యా...నాయొక్క పాపిష్టి జీవితాన్ని గురించి...మీకేమని చెప్పుకొందును! చెప్పవలసినది—చెప్పవలసినది అని ఏకప్రాణం తీస్తోన్నారు. నా జీవిత రహస్యాలని బహిరంగ పరచుటకు నాకు నోరాడటం లేదు......మరిన్ని యిటువంటి నీచమైన చరిత్రను వినుటచే మీరుకూడా కొంత పాపాన్ని మూటగట్టుకోవలసి వస్తుంది. పరమపావనులు మీరు! నేనో...దుర్మార్గ

రాలిని...పాపిని......నన్ను కత్తులతో పొడిచి చంపి ననూ పాపం లేదు...యింకా నన్నా పాపభగవంతుడు ఎందుకుంచాడో! 'పాపీ చిరాయుః' అన్న అర్యోక్తి అబద్ధమవుతుందా! అబ్బా...నేచెప్పలేను నా చరిత్ర పాపం..."అంటూ పొంగిపొంగి వస్తోన్న దుఃఖాన్ని ఆపుకొనలేక వెనక్కుపడింది. ఆమె నేత్రాల్లోనుంచి కన్నీటిధారలు కారుతున్నాయి.

ఆమె యేడ్పును సముదాయించాము. "అమ్మా నీవేమియు భయపడవద్దు. జరిగినదేదో జరిగినది. గతించిన దానికై విచారించుట నిష్ప్రయోజన మవుతోంది. తెలియకచేసిన పాపాన్ని చెపితే పరిహార మవుతుందంటారు. కాబట్టి ఈ విషయమై నీవేమియు చింతించక త్వరితముగా చెప్పుము!...అయినా, ప్రపంచములో ఎంతమంది యింతకంటె నీచంగా ప్రవర్తించినవారు లేరు? ఎంతమంది కులంనించి వెలివేయ బడ్డవారు లేరు! నీవొక్కర్తెవే కాదులే...దురాచారమనేదే అసలు ప్రబలిపోయింది" అని అనేక రకాలుగా ఆమెను బుజ్జగించి మరలమరల అడిగాం. చివరకామె యీలాచెప్పింది మెరుస్తోన్న నేత్రాల్తో.

"కులమునకు నేనునూ ఒహ పేరెన్నిక గన్న బ్రాహ్మణ యువతినే. అయితే ఏమి లాభం! నా జీవితమంతయు అడవిగాచిన వెన్నలయింది. మా తండ్రిగారొక సనాతన ధర్మాచార పరాయణులు. మేము ముగ్గురు బిడ్డలం ఆయనకు. నేను కడగొట్టుదాన్ని. ప్రథమద్వితీయులు నాకు సోదరులు. నాకు తెలివివచ్చే సరికల్లా మాతండ్రిగారు పరలోకయాత్ర సాగించారు. అప్పటినుంచి మా అమ్మయే మమ్మల్ని కొంతవరకు పెంచి పెద్దవాళ్ళను చేసింది. అప్పుడప్పుడు మాత్రం ఆమె భావప్రపంచములో మా నాయనగారివిగ్రహం అగుపించినపుడల్లా ఏడుస్తోండేది. కాని మేం, దిగులుపడిపోతామని అట్టే ఏడ్చేది కూడా కాదు. లోలోపలే అణచుకుంటుండేది దుఃఖాన్ని. అదిన్నీ గాక మా అమ్మ యిరుగుపొరుగు వారితో మాట ప్రస్తావనగా "ముందుముందు దాని గతి ఎంగావాలి...పాముకున్నన్ని పండ్లు లేవుగదా!" అని నా విషయం అప్పుడప్పుడు వారితో ముచ్చటించుతూ కండ్లవెంట బొటబొట నీళ్లు కారుస్తూండడంకూడా నే చూచినటులే గురుతు. అయినా అప్పటికింకా నాకు ప్రపంచ జ్ఞానం అంతగా తెలియనందున వారి ఆలోచనలో నేనేమీ జోక్యం కలిగించుకునేదాన్ని కాను. నన్ను చూచినప్పుడల్లా ఆమె ముఖాన ఒహా విధమయిన జాలిగుణం అగుపించేది. కండ్లు తడి అయేవి.

* * *

కాలచక్రం తిరిగింది. యీ ప్రపంచములో ఎన్నెన్నో మార్పులు కలిగాయి. నాకు తీరా పదవ సంవత్సరం గడవకముందే......అల్లారుముద్దుగా పెంచుతూన్న నా తల్లికూడా నాకు దూరమయింది. ఇదంతా నాదురదృష్టం! నాకు చాలా కాలంవరకు తల్లి మీది ప్రేమ తగ్గనేలేదు.

మరికొన్నేండ్లు జరిగాయి...నాతోటి వారలందరకు వివాహాలుకూడా అయాయి. భర్తలతో సుఖంగా కాలం వెళ్లబుచ్చుతోన్నారు. మరి...నా కర్మమేమిటా...యని నాకు తీవ్రమైన విచారం కల్గింది. అది అనంతమైన విచారం. అది నాహృదయములో కార్చిచ్చువలె రగుల్కొంటూంది.

నేను వైధ్యమనే గొలుసులచేత బాధించ బడితినని క్రమంగా తెలుసుకున్నాను. అప్పుడు నాకు ఒహ విధమయిన భయం!కల్గింది. ఒళ్లంతా కంప మెత్తింది. అల్లు తీసిన తేగవలె కూలిపోయాను. భర్తంటే ఎవరో—వివాహమంటె ఏమిటో—యింతవరకు నాకు సరిగ్గా తెలియనే తెలియదే! అప్పుడే వివాహ మవటం— భర్తృవియోగం సంభవించటం కూడా!! యింతా గ్రహించేసరికి నా మనస్సంతా ఒకవిధంగా మారిపోయింది. ఎవో క్రొత్త క్రొత్త వూహాలు నాలో రేకెత్తాయి. పసితనాన్న గొంతులు కోస్తున్న ఈ పాపిష్టి సంఘాన్ని తలంచేసరికల్లా...ఔరంగజేబు పరిపాలన నాటికాలములో హిందూమతాన్ని ధ్వంసంచేస్తూ దేవాలయాల గోపు

రాళ్ళి పడగొట్టిన మ్లేచ్ఛులు ఒక్కసారిగా జ్ఞప్తికి వచ్చారు. ఇప్పుడీ సంఘంకూడా అంతే, సంఘం— సంఘం అని మనం వూరక విర్రవీగుతాం. సంఘం చేసే పనులన్నీ యింతేనా? అని నాలో నేను ఏడ్చాను. నాలో నేనే తిట్టుకున్నాను. సంఘాన్ని—భగవంతుణ్ణి కూడా దూషించాను. ఎవర్ని నిందించితే ఏం లాభం గనుక? నా కర్మమేమయినా తప్పిందా!

ఆరోజునుంచే బజారుముఖం చూడడానికి నాకు మొగం చెల్లలేదు, రంగురంగుల చీరెలుకట్టడం—తల దువ్వి శృంగారించుకోవడం-పూలుపెట్టుకోవడం పూర్తిగా పరిత్యజించాను.

* * *

కాలచక్రం తిరుగుతోంది. నాకు యవ్వనం ముదిరేకొలది నాహృదయం క్రొత్త క్రొత్త భావాలకు ఆధారమయింది. నా వున్నతోరస్థలాన్ని చూచి నాలోనే కృంగిపోయేదాన్ని. ఆశ అనేది నా మనస్సులో హరించిపోయింది. అనాథ స్త్రీలయొక్క జీవితం ప్రపంచ నాటకంలోని ఒక రంగము కదాయని గ్రహించాను, పరపురుషులను కన్నెత్తిఅయినా చూశేదాన్ని కాను. నాలో నేనే దుఃఖిస్తూ కృశించి పోతూండేదాన్ని. నాకు ధైర్యం చెప్పేవారు కూడా లేరు. నాలో నేనే ధైర్యం చెప్పుకుంటూ నా ఆత్మకు కొంత వుపశాంతి కల్గించుకొనేదాన్ని. శుష్కించి పోతూన్న నా దేహాన్ని చూచి కుమిలిపోతూండేదాన్ని.

* * *

మా కుటుంబములో అగ్నిపర్వతం బయులుదేరింది. అది క్రమంగా కంపించి ఒక్కసారి భగ్గుమంది. ఆ కదిలిక యొక్క అర్థం నే గ్రహించలేకపోలేదు. దానితోపాటు మా కుటుంబమంతా విడిపోయింది. అప్పుడు నాహృదయంలోని దిగులు మరింత యెక్కువైంది. నేను ఏకప్రాణి నయ్యాను. నాకు నేనే ఆధారం. నన్నో చోట వంట మనిషిగా కుదిర్చి వాళ్ళ త్రోవ వాళ్లు చూచుకున్నారు మాసోదరులు.

తుదకు నా బ్రతుకు వంటలు కూడా చేయవలసి వచ్చిందా భగవంతుడా అనుకొని పనిలో ప్రవేశించాను. వంటచేస్తూ అక్కడనే రోజులు వెళ్లబుచ్చుతోన్నాను. యీలా కొన్నాళ్లు జరిగింది. నాయందు యజమానుడు బహుసరదాగా వుండేవాడు. నేనంటే ఆయన కపరిమితమైన ప్రేమకూడాను. ఆ ప్రేమే నాఅంత్యానికి నా దౌర్భాగ్య దశకు మూలమయింది. నన్నుజూచినపుడల్లా ఆయన ఒహ నిట్టూర్పువిడిచి ఒక నిమిష కాలము తనలో తాను ఏమిటో దీర్ఘంగా ఆలోచించేవాడు...... నేనంత రూపవతిని కూడా కాను. అయినను మిలమిలలాడే నా శరీరం ఆయనదృష్టి నాకర్షించింది. నిండుచంద్రుని కాంతిలా ప్రకాశించుతోన్న నా ముఖబింబమే ఆయన్ను పూర్తిగా ముగ్ధునిజేసి వైచింది. క్రమక్రమంగా మా యిరువుర మధ్యనూ ఒహ విధమయిన ప్రేమాంకురాలు మొలకలెత్తాయి.

* * *

ఒకానొకదినం. అది వెన్నెలరాత్రి. ఆవేళరాత్రి నేనొక్కర్తెను యథాప్రగారం మేడమీద పరుండి వున్నాను. వెన్నెల పిండారబోసి నటులుంది. గాలికూడా బాగాహాయిగా వీస్తోంది. అక్కడక్కడమాత్రం చుక్కలు తొంగిచూస్తోన్నాయి అనంతమైన ఆకాశాన్ని. పది కొట్టే సరికల్లా అప్రయత్నంగా కండ్లుమూశాను.

............సగం నిద్రలో మెలుకువవచ్చింది. ఉలిక్కిపడి లేచాను. శాంతియుతమయిన నాఆత్మ కంపింపసాగింది. కారణం కనుగొనలేకపోయాను. ప్రక్కకు తిరిగి చూశాను. అది నాజన్మలోకూడా అనుభవించని ఒహ క్రొత్తరకం. నానుదుటిమీద వ్రాదుతూన్న మాయింటి యజమాని ముఖం. ముఖం పైకెత్తాను. పరిపూర్ణ కళలతో ప్రకాశించుతోన్న చంద్రబింబం మాత్రము నానేత్రాల

కగుపించింది. తన చల్లని కిరణాలతో నన్ను మరింత ప్రోత్సాహించుతోంది. అప్పుడు నాహృదయం నల్ల మబ్బులను చూచిన నెమలిలాగు పురివిప్పింది. ఏంజవాబిచ్చేందుకూ నాకు నోరాడలేదు. నన్నావ్యక్తి మరింత అదుముతూన్నాడు. నాదేహమంతా బాధించబడ్డట్లయింది. అదో-అప్రయత్నంగా నానోటినుంచీ "అబ్బా ...ఏమిటండీ యిది."— "అసహ్యం..." అన్నమాటలు మాత్రం వెల్వడ్డాయి. అందుకాయన ఏవో కొన్నిమాటలు చెప్పాడు. అందుకునేను మౌనంగా వూరుకున్నాను. "మౌనం అర్థాంగీకారం" అని అనుకున్నాడు కాబోలు, నాదేహాన్ని పూర్తిగా స్వాధీనపరుచుకున్నాడు. నా ఆవేదన కొంతవరకు తగ్గింది. ఆరాత్రంతా అతని బాహువులలో మణిగివున్నాను......ఆలాగే కొన్ని మాసాలు కూడా సునాయాసముగా గిర్రున తిరిగిపోయాయి.

* * *

క్రమంగా యీ దుర్వార్త వూరంతా వ్యాపించిపోయింది. లోకులందరూ నన్ను దూషించారు. సంఘానికి అపకీర్తి తెస్తున్నానని కులములోనుంచి వెలివేశారు. నా సోదరులకు నే విషమై పోయాను. నేనంటే నాలుక కొరుక్కునే మాయింటి యజమానికికూడ నాయందు నాకరుణగాని-ప్రేమగాని లేకపోయింది.

నేను నిరాధారనయాను. జీవితంమీద వెగటు బుట్టింది. దేహాన్ని వదలివేద్దామన్నంత కష్టమైంది. కాని యింకో దుర్మార్గుడు నాకా సమయానికి ఆధారమై మరి కొన్నాళ్లు భూమిమీద నిలబెట్టాడు. అతనింకా నన్ను పూర్తిగా పాడుచేశాడు. అతనితో అన్నిపట్టణాలు అన్ని దేశాలు తిరిగాను. దేశదేశాల నాగరికతలను నే ననుకరించాను. సుఖమంతా అతనితోనే వుందనుకొన్నాను. రూపాయలు దమ్మిడీగ ఖర్చుచేశేవాళ్ళం. నాస్వరూపమంతా పూర్తిగా మారిపోయింది. కాళ్ళకు బర్మా శాండల్సు వెంటనొక దాసీ లేందే బయటకు వచ్చేదాన్ని కాను. నన్ను దూషించినవారంతా అప్పుడు నన్నుచూచి సిగ్గుచెందేవారు. నన్నుగురించి పలువురు పలువిధాలగా చెప్పుకునేవారు. నేనంటే ప్రతివాళ్లు వువ్విళ్లూరేవారు. అనేకమంది నాకు దాసులు అయారుకూడాను. రకరకాల వస్తువులునాకు కొనిపెట్టేవారు. నాపమిటనిండా రూపాయలు వెదజల్లి పోయేవారు.

ఆలాంటిజీవితమే అప్పుడు నాకు హాయి గూర్చింది. నిర్విచారమయిన జీవితమది. ఎల్లప్పుడూ ఆలాగే వుంటే బాగుండుననిపించింది. ఎప్పుడూ నాకెవరో ఒకారు తోడుగా వుండాలిసిందే. పగలంతా నన్నుగూర్చి వుపన్యసించి అసహ్యించుకొనే సనాతన చక్రవర్తులందరూ దీపాలుపెట్టగనే నాకు పరిచారులయ్యేవారు. ఒకరనేమిటి......లెక్కలేనంతమంది!

* * *

చాలామాసాలు-సంవత్సరాలు గడిచాయి. నేను పూర్తిగా మారిపోయాను. బలహీనం ఏర్పడింది. రక్తం లేదని డాక్టర్లుచెప్పారు. మంచానబడ్డాను. పలకరించేదిక్కు లేకపోయింది. అందరూ నన్నుచూచి అసహ్యపడేవారు. నన్ను చూచేందుకుకూడా ఎవ్వరికీ ప్రాణం ఒప్పిందికాదు. కాలవైపరీత్యం? అప్పటి స్వేచ్ఛా జీవితమంతా స్వప్నతుల్యమయింది. సహజ సౌందర్యముతో వుట్టిపడే ఆప్రకృతి దృశ్యాలన్నీ మబ్బుచాటున మణిగిపోయాయి. అప్పటి నా డాంబిక వేషమంతా కేవలం రంగస్థలంమీది వేషధారణమయింది.

దినాలుగడిచే కొలది నాశల్యమే మిగిలింది. రుగ్మత ఎక్కువయింది. ఈ ప్రపంచములో యికనాకు తావు లేదనుకున్నాను. లోకమంతా వట్టిబూటకము గదా అని గ్రహించాను. మరల కొంచెం సత్తువ వచ్చింది. కాళ్ళకు బుద్ధిచెప్పి యీలా తిరుగుతూన్నాను. అంతేగాని 'నేనేమో పిచ్చిదాన్నిగాను' అంటూనే తుర్రున అక్కడనుంచి పారిపోయింది.